సాగరతీరం..కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు.

సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సార్వా సాగుకు రైతులు సన్నద్ధం

నారుమడుల పనుల్లో బిజీగా అన్నదాతలు

ఇప్పటికే ఆలస్యమైన సాగు

వెంటాడుతున్న నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రకృతి వైపరీత్యాల భయం

ప్రజాశక్తి - కాళ్ల

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ (సార్వా) సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. తొలకరి పలకరింపుతో రైతులు వడివడిగా వ్యవసాయ పనులవైపు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది కూడా ముందుగానే కాలువలకు సాగునీటిని ఈనెల ఒకటో తేదీన విడుదల చేసినప్పటికీ ఎండలు నేపథ్యంలో రైతులు నారుమడులు వేసేందుకు వెనకంజ వేశారు. రుతుపవనాల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. జూలై మొదటివారానికి నారుమడుల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. ఖరీఫ్ లో రైతులు ఎంటియు 1318, 1121, 1061, 1064, 1029 వంటి విత్తనాలను సాగు చేయనున్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తుంటే జూలై నెలాఖరు నాటికి ఖరీఫ్ నాట్లు పూర్తయ్యే అవకాశం కనిపిస్తుంది.

కత్తి మీద సాముగా సాగు

సార్వా సాగు అంటే కత్తిమీద సాములాంటిది. ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశాలు ఎక్కువ. దీంతో భారీ వర్షాలు, వరదల భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగు త్వరితగతిన చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులు 3.5 లక్షల ఎకరాల్లో సార్వా సాగు చేపట్టనున్నారు. ఇప్పటికే 20 శాతం ఎకరాల్లో నారుమడులు పూర్తిచేశారు. కాళ్ల మండలంలోని జక్కరం, బొండాడ, కోపల్లె, సీసలి, దొడ్డనపూడి గ్రామాల్లో నారుమడులు పూర్తిచేశారు.

విత్తన ఎంపికే కీలకం

సార్వా, దాళ్వా ఏ సీజన్ అయినా విత్తన ఎంపికే అత్యంత కీలకం. నాణ్యమైన విత్తనాలు అయితే దిగుబడి బాగా రావడానికి అవకాశం ఉంటుంది. అదే సమయంలో వర్షాకాలం కావడంతో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. సార్వా సాగులో గత మూడు పంటలుగా 1121 వరి రకాన్ని ఎక్కువ శాతం సాగు చేస్తున్నారు. ఈసారి కూడా ఆ వరి రకం సాగుకే మక్కువ చూపుతున్నారు. ఈ విత్తనాన్ని కొంతమంది రైతులు భద్రపరిచి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎంటియు 1318, 1121, 1061, 1064, 1029 వంటి విత్తనాలను కొనుగోలు చేసి నారుమడులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. 50 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలని చిన్న, సన్నకారు రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కాళ్లలో పోసిన నారుమడి

అభివాదం చేస్తున్న నాయకులు

జిఒ117ను రద్దు చేయాలి

సిపిఎస్ రద్దు చేసేవరకూ పోరాటం

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు మినహాయించాలి

ఫ్యాప్టో ఉమ్మడి జిల్లా సదస్సులో నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాఠశాల విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న జిఒ 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఫ్యాప్టో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సదస్సును ఏలూరు జిల్లా ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ జి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఛైర్మన్ నారాయణ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర నాయకులతోపాటు ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎల్.సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం వల్ల వేలాది ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరి దారుణంగా ఉందని, తక్షణం ఇలాంటి వైఖరి విడనాడాలని కోరారు. అలాగే బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, ఉద్యోగోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కో ఛైర్మన్ బి.మనోజ్ కుమార్ మాట్లాడుతూ నేడు ప్రకటించిన ఉపాధ్యాయ ఉద్యోగోన్నతులన్నీ కొత్తగా వచ్చినవి కాదని, ఎస్‌జిటి పోస్టులు రద్దు చేయడం ద్వారా పొందినవేనని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, పిఆర్‌సి, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలని, చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 11వ పిఆర్‌సికి అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఫ్యాప్టో పోరాటం కొనసాగుతుందన్నారు.

రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఎపిఎన్‌జిఒ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ రామారావు, సిఐటియు నాయకులు ఆర్.లింగరాజు, ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఫ్యాప్టో పోరాటానికి మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ జవహర్‌లాల్, జనరల్ సెక్రటరీ దామోదర్, తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ జనరల్ శేష బ్రహ్మం పాల్గొన్నారు.

నేటి నుంచి ఏలూరు జిల్లాలో 'పోరుకేక'..!

పోలవరం నిర్వాసితుల సమస్యలే ప్రధాన ఎజెండాగా సిపిఎం పాదయాత్ర

వేలేరుపాడు మండలం రుద్రంకోటలో ప్రారంభ సభ

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో యాత్ర

ఆరు మండలాలు, 25 గ్రామాల మీదుగా పాదయాత్ర

తొలిరోజు సభలో పాల్గొనున్న ఎంసిపిఐయు నాయకులు నాగభూషణం

జులై ఒకటో తేదీన ఏలూరు నుంచి విజయవాడకు పయనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగుతున్న 'పోలవరం పోరుకేక' పాదయాత్ర ఈనెల 26వ తేదీన ఏలూరు జిల్లాలోకి ప్రవేశించనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం గ్రామంలో సోమవారం మధ్యాహ్నానికి యాత్ర ముగించుకుని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామంలోకి యాత్ర ప్రవేశించనుంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభ సభ జరగనుంది. సభలో ముఖ్యవక్తగా ఎంసిపిఐయు నాయకులు నాగభూషణం పాల్గొనున్నారు ఈనెల 26వ తేదీ నుంచి జూలై ఒకటోతేదీ వరకూ పాదయాత్ర జిల్లాలో సాగనుంది. మొత్తం ఐదున్నర రోజులపాటు వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, పోలవరం మీదుగా మొత్తం ఆరుమండలాలు, 25 గ్రామాల మీదుగా యాత్ర సాగనుంది. ఆరుచోట్ల బహిరంగ సభలు, 14 చోట్ల సభలు జరగనున్నాయి. ప్రధానయాత్రకు అనుబంధంగా పోలవరం మండలం నుంచి ఉపయాత్ర జరగనుంది. సిపిఎం నాయకులు కె.శ్రీనివాస్, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ ఆధ్వర్యంలో 28, 29 తేదీల్లో రెండురోజుల పాటు 51 కిలోమీటర్ల మేర నడవనుంది. ప్రధాన యాత్ర బృందంతో ఈ ఉపయాత్ర 29వ తేదీన బుట్టాయగూడెంలో కలవనుంది. పాయాత్రలో వేలాది మంది నిర్వాసిత గిరిజనులు, సిపిఎం కార్యకర్తలు, నాయకులు పాల్గొనున్నారు. బహిరంగ సభలో రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు ప్రసంగించనున్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఈ పాదయాత్ర సాగుతోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం చట్టంలో పొందుపరిచింది. పోలవరం ప్రాజెక్టుకు అయ్యే ఖర్చు మొత్తం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపింది. తొమ్మిదేళ్లుగా కేంద్రంలోని మోడీసర్కార్ పోలవరానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. నిధులు రాబట్టడంలో గతంలో టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు సైతం విఫలమయ్యాయి. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రాజెక్టు ఖర్చు రూ.52 వేల కోట్లు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. ఇందులో రూ.30 వేల కోట్లు నిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు అవుతుందని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వపోవడంతో నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి, ఇళ్లు కోల్పోతున్న వారికి ఇళ్లు, పునరావాస ప్యాకేజి, 18 ఏళ్లు నిండిన యుతవకు పరిహారం, పునరావాస కాలనీల్లో కనీస వసతులు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు పరిహారమివ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణంపై శ్రద్ధ పెడుతున్నాయే తప్ప నిర్వాసితుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 41.15 కాంటూరు పరిధిలో కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో 7,071 కుటుంబాలుండగా ఇప్పటి వరకూ ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అందుకున్న కుటుంబాలు 1,043 మాత్రమే. ఇంకా 5074 కుటుంబాలకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వలేదు. ఇంకా 45.72 కాంటూరు పరిధిలోని 14,703 నిర్వాసిత కుటుంబాల పరిస్థితి ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. నిర్వాసితుల నివాసం కోసం జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో చేపట్టిన నిర్వాసిత కాలనీలు 40 శాతం కూడా పూర్తికాలేదు. శ్మశానం, తాగునీరు, డ్రెయినేజీ, వంటి కనీస వసతులు ఇప్పటికీ పూర్తికాలేదు. 18 ఏళ్లు నిండిన యుతవకు పరిహారంపై ఆమోదయోగ్యంకాని నిబంధనలను తెరపైకి తెచ్చి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. 2017 జూన్ నెలాఖరుకు 18 ఏళ్లనిండిన యువతీ, యువకులను పరిగణలోకి తీసుకుంటామని కటాఫ్ తేదీ నిర్ణయించడం దారుణం. గ్రామాలను ఖాళీచేసే సమయానికి 18 ఏళ్లు నిండిన యువతను అర్హులుగా తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా, కాపర్ డ్యాం నిర్మాణం పూర్తిచేయడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 గ్రామాల్లో గత ఏడాది జూలైలో వరదలకు నీటమునిగిన పరిస్థితి నెలకొంది. నెలల తరబడి నిర్వాసితులు పునరావాస కాలనీల్లోనే గడపాల్సి వచ్చింది. మళ్లీ జూలై వస్తున్నా పరిహారం మాత్రం నిర్వాసితులకు అందించలేదు. నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం ఆది నుంచి పోరాడుతూనే ఉంది. నేడు సమస్య పరిష్కారం కోసం ముంపుమండలాల్లో 'పోలవరం పోరుకేక' పాదయాత్ర చేస్తోంది. నిర్వాసితుల పట్ల ఆది నుంచి నిబద్ధతో పనిచేస్తున్న సిపిఎం చేపట్టిన ఈ పాదయాత్రపై అంతటా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పాదయాత్రలో సంఘీభావం తెలిపేందుకు రాజకీయాలకు అతీతంగా అనేకమంది మద్దతు తెలుపుతున్నారు.

గోదావరి ఉప్పెనలా...

ఉత్సాహంగా పోలవరం పోరుకేక మహాపాదయాత్ర

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సంపూర్ణ సంఘీభావం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి, వి ఆర్ పురం, కూనవరం

పోలవరం నిర్వాసితుల పోరుబాట గోదావరి ఉప్పెనలా... ముందుకు సాగుతోంది. ఈనెల 20వ తేదీన ఎటపాక మండలం నెల్లిపాకలో సిపిఎం ఆధ్వర్యంలో పోరుకేక మహా పాదయాత్ర ప్రారంభమైన విషయం విధితమే. ఆరో రోజైన ఆదివారం వీఆర్ పురం మండలంలో సుమారు 20 కిలోమీటర్లు పాదయాత్ర నడిచింది. దీంతో మొత్తం 120 కిలోమీటర్ల మార్కును దాటి ముందుకు సాగుతోంది. గ్రామ గ్రామాన పోలవరం నిర్వాసితులను కలుపుకుంటూ వెళుతున్న ఈ యాత్ర విశేష జన మద్దతు లభిస్తోంది. జెండాలకు అతీతంగా, ఒకే అజెండాతో రాజకీయ పక్షాలు సంఘాలు ఏకమవుతున్నాయి. పాదయాత్ర ఆహ్వానించి తమ మద్దతును తెలుపుతున్నాయి. ఆదివారం ఉద్యోగ,ఉపాధ్యాయ, రైతు, గిరిజన తదితర ఎనిమిది సంఘాలు పాదయాత్రకు మద్దతు తెలిపాయి. రామవరంలో మొదలైన పాదయాత్ర అడవి వెంకన్నగూడెం, సున్నంవారిగూడెం మీదుగా రాత్రికి రేఖపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా సుమారు ఆరు గ్రామాల్లో నిర్వాసితులు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో పాదయాత్రకు విన్నవించారు. తమ కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ఈ కష్టకాలంలో లేకపోవడం తీరని లోటని ఉమ్మిడివరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పాయం రామారావు ఓ బహిరంగ సభలో వెల్లడించటం ఆదివాసి హృదయాల్లో సున్నం రాజయ్య చెరగని ముద్ర వేశారని స్పష్టమవుతోంది. రంపచోడవరం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సున్నవారిగూడెంలో జరిగిన మహాసభలో పాల్గొని తన సంఘీభావం తెలిపారు. పోలవరం నిర్వాసితులు ఏకం కావలసిన అవసరాన్ని స్పష్టం చేవారు.

సమస్యలు వింటూ.. ముందుకు సాగుతూ..

పోలవరం నిర్వాసితుల సమస్యలను వింటూ పాదయాత్ర ముందుకు సాగుతోంది. సోములగూడెంలో 150 కుటుంబాలు ఉన్నాయని, 38 మీటర్లకే వరద ముంచెత్తుతున్నా ప్రభుత్వం 45వ కాంటూరులో ప్రకటించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత వరదలకు ఇల్లు కూలిపోయిన వారికి రూ.పదివేల ఆర్థిక సహాయం కేవలం 20 శాతం మందికి ఇచ్చారని వాపోయారు. తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం లేదని, సవరణది నీటిని పైప్ లైన్ ద్వారా సదుపాయం కల్పించాలని కోరిన ముంపు ప్రాంతాల్లో అభివద్ధి చేయలేమని అధికారులు చెబుతున్నారని తెలిపారు. లక్ష్మీనగరంలో 120 కుటుంబాలుండగా, ఇక్కడా 38 మీటర్లకే గ్రామం ముంపునకు గురవుతున్నా 45.72 కాంటూరులో చేర్చారని వాపోయారు. గత ఏడాది వరదల కాలంలో ఐదు కేజీల బియ్యం, నాలుగు ఉల్లిపాయలు, టమోటాలు బంగాళదుంపలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది వచ్చిన వరదలకు కూలిపోయిన ఇళ్లకు పరిహారం కేవలం 25 శాతం మందికి చెల్లించినట్లు వివరించారు.

అడి వెంకన్నగూడెంలో 130 కుటుంబాలు ఉన్నాయని, 41.15 కాంటూరులో చేర్చినప్పటికీ ఎటువంటి సహాయ కార్యక్రమాలు అందలేదని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాలలో మూడు గ్రామాలకు మాత్రమే పునరావాసం కల్పిస్తున్నారని, ఎక్కడ కోరుకుంటే అక్కడ పునరావాసం కల్పించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

ఆక్వా రైతు విలవిల..!

తగ్గిన రొయ్య ధర

నిబంధనల పేరుతో రాయితీలకు దూరం

ప్రజాశక్తి - కాళ్ల

వాతావరణ మార్పులతో రొయ్యల రక్షణకు ఆక్వా రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటి వరకూ ఎండలు తీవ్రంగా ఉన్నాయి. అకస్మాత్తుగా వాతావరణం మారి వర్షాలు కురవడంతో ఆక్సిజన్ కొరత ఏర్పడి వనామి రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతున్నా వర్షం నేపథ్యంలో కొన్ని చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. దీంతో రైతులు హడావుడిగా రొయ్యల పట్టుబడులు చేపడుతున్నారు.

రొయ్యలు పట్టుబడి చేస్తున్న రైతులు

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రొయ్యల ధరలు పతనమవుతుండగా, పంట చేతికొస్తున్న దశలో నెలకొన్న పరిస్థితిపై ఆక్వారైతుల్లో ఆందోళన నెలకొంది. విదేశాలకు ఆర్డర్లు లేవంటూ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, వ్యాపారులు కొనుగోళ్లు బాగా తగ్గించడంతో మార్కెట్లో రొయ్య ధర పతనమైంది. వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో ఇవే ధరలు ఉంటే తాము అప్పుల ఊబిలో కోరుకుపోక తప్పదని అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం

ఉమ్మడి జిల్లాలో 1.2 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి. కోవిడ్ సమయం నుంచి జిల్లాలో ఆక్వా రంగం తీవ్ర ఒడిదుడుకుల మధ్య సంక్షోభం వైపు పయనిస్తోంది. పెరిగిన మేత, మందులు ధరలు, లీజులతో ఇబ్బందులు, ఆక్వా జోన్ల సమస్య, విద్యుత్ ధరలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆక్వా రైతులకు ముందుగా సంబంధిత వ్యాపారులు సాగుకు అవసరమైన దాణా, మందులు ఇతర ఉత్పత్తులన్నీ అరువుపై ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

నిబంధనలతో కొందరికే విద్యుత్ సబ్సిడీ..

సిఎం జగన్మోహన్ రెడ్డి యూనిట్ ధరను రూ.1.50లకే ఇస్తామని చెప్పినా అది అందరికీ అమలు కావడం లేదు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఆక్వా సాగు ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా ప్రకటించారు. దీంతో రూ.7గా ఉన్న యూనిట్ విద్యుత్ ధరను అప్పట్లో రూ.3.86లకు తగ్గించి రైతుకు ఊతమిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం యూనిట్ ధరను రూ.1.50కు ఇస్తామని చెప్పినా ఇ-ఫిష్ విధానంలో నిబంధనలు విధించారు. ఆక్వా, నాన్ ఆక్వా జోన్లుగా విభజించారు. పదెకరాల వరకూ సాగు చేసిన రైతులకు యూనిట్ విద్యుత్తు ధరను రూ.1.50కే వర్తింపజేస్తామని చెప్పి నిబంధనలు పెట్టారు. 10 హార్స్ పవర్ వినియోగించే రైతులకు రాయితీ వర్తిస్తుందని, ఇ-ఫిష్ విధానంలో చెరువు లీజు ఒప్పందం, లైసెన్స్, విద్యుత్ మీటర్, భూమి ఆన్‌లైన్ పత్రాలు ఇవ్వాలని మెలికపెట్టారు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా యూనిట్ ధర రూ.6 చెల్లించాల్సిందే. జిల్లాలో ఎక్కువ మంది ఆక్వా జూన్ పరిధిలో లేకపోవడంతో వీరికి రాయితీ వర్తించని పరిస్థితి నెలకొంది.

ఆక్వా చెరువులో నిరంతరాయంగా తిరుగుతున్న ఏరియేటర్లు

అయితే పెట్టుబడి పెరగడం, నాణ్యమైన రొయ్య పిల్లల లభ్యత తక్కువగా ఉండడం, మేత, రసాయనాల ధరలు పెరగడం సాగుకు తీవ్ర ప్రతి బంధకాలుగా ఉన్నాయని ఆక్వా రైతులు ఆవేదన చేస్తున్నారు. ఏడాది పాటు రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ అందకపోవడం సమస్యను తీవ్రం చేసిందని చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి విద్యుత్ రాయితీ అమలు చేస్తున్నా 2022 మే నుంచి 2023 మార్చి వరకూ అదనంగా రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి రావడం భారంగా మారిందంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని కనీసం మద్దతు ధర ప్రకటించి అమలయ్యేలా చూడాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

చనిపోయిన రొయ్యలను చూపుతున్న రైతు వెంకటేశ్వరరావు

తాజాగా అమెరికా, కెనడా, యుకె, ఇతర ఐరోపా దేశాల నుంచి ఆర్డర్లు చాలా తక్కువగా ఉండడంతో పరిమితంగా రొయ్యలు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏటా పంట చేతికొచ్చే మే చివరి వారం, జూన్, జులై నెలల్లో ధరలు తగ్గించి కొనుగోలు చేయడం రివాజుగా మారిందని రైతులు వాపోతున్నారు. 100 కౌంట్ ధర రూ.250 ఉంటేనే ఎంతో కొంత మిగులుతుందని చెబుతున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు..

గతంలో వంద కౌంటు కేజీ రొయ్యల సాగు ఖర్చు రూ.150 నుంచి రూ.160 వరకూ ఉండేది. మేత, మందులు, చెరువు లీజు, కూలీల వేతనాలు, కరెంటు బిల్లులు పెరగడంతో వంద కౌంటు కేజీ వనామీ రొయ్యల సాగు ఖర్చు రూ.240లకు చేరుకుంది. అయితే 40 కౌంట్ నెల క్రితం రూ.420, ప్రస్తుతం రూ.300 ఉంది. 50 కౌంటు నెల క్రితం రూ.310, ప్రస్తుతం రూ.260 ఉంది. 60 కౌంట్ రూ.290, ప్రస్తుతం 240 రూపాయలు మార్కెట్లో ధరలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఈ ధరలు అమలు కావడం లేదు. దీంతో రైతులకు నష్టం తప్పని పరిస్థితి.

రాయితీ రైతులందరికీ వర్తింపజేయాలి

చల్లగరువుల రాజేష్, ఆక్వా రైతు, ప్రాతళ్లమెరక

ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఎత్తివేసేందుకు దారులు వెతికి రైతుల్లో ఆందోళన కలిగించింది. ఆక్వా, నాన్ ఆక్వా జోన్ అని కొన్ని రోజులు, ఐదెకరాల్లోపు, ఆపైవారు అని మరికొన్ని రోజులు, సర్వేల పేరుతో చేస్తున్న కాలయాపన గురించి రైతుల్లో అసంతృప్తి ఉంది. మేత ధరలు అదుపులో ఉండటం లేదు. ఈ రంగాన్ని పరిశ్రమగా గుర్తించి ఇతర పరిశ్రమలకు ఇస్తున్న మాదిరే విద్యుత్, ఇతర రాయితీలు వర్తింపజేయాలి.

నిరంతరం ఏరియేటర్లు తిప్పాలి

సిహెచ్ రాంబాబు, మత్స్యశాఖ అధికారి ,కాళ్ల

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చెరువులో మేత తక్కువగా వేయాలి. నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పడం వల్ల చెరువులో ఆక్సిజన్ ఉత్పన్నమవుతుంది. ఆయిల్ ఇంజిన్లతో నీటిని రీసైక్లింగ్ చేయాలి. చెరువుల వద్ద రైతులు అప్రమత్తంగాఉండాలి.

కళాకారులకు శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రస్థాయి కళారూపాల గురువుల శిక్షణ తరగతులు స్థానిక సుందరయ్య భవనంలో ఈ నెల 29వ తేదీ వరకూ ఐదు రోజులపాటు జరగను న్నాయని, ఈ మేరకు ప్రారంభ సభను ఆదివారం ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కవి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సభను ముఖ్యఅతిథి బివిఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల రామారావు డప్పు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సమాజానికి అవసరమైన ఎన్నో కార్యక్రమాలను నాట్యం, డప్పు ద్వారా, పాటల ద్వారా ప్రజలకు చేరువేయడంలో ప్రజానాట్య మండలి ముందుండి నడిపిస్తోందన్నారు. కళారూపాలను పెంచి పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను కూడా ప్రతినెలా కళాకారులను ప్రోత్సహిస్తూ వారికి ప్రోత్సాహకాలు ఇస్తున్నానని తెలిపారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ గురువుల శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన వారందరూ వారి వారి జిల్లాలకు వెళ్లి ఆ జిల్లాలో శిక్షణ తరగతులు నిర్వహించి కళాకారులను తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా వీధి నాటకాలు, పాటలు, నాట్యం, కోలాటం, డప్పుపై శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. దండు నాగేశ్వరరావు, కవి, మురళీకృష్ణ, వంశీకృష్ణ, తదితరులు కళాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనీల్ ప్రసంగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు

శ్రీసూర్యలో కొత్త కోర్సులు

ప్రజాశక్తి - నరసాపురం

2023- 2024 విద్యా సంవత్సరం నుంచి సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టిందని శ్రీ సూర్య విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నరసాపురం శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో మేజర్ సబ్జెక్టులుగా బిఎస్‌సి విభాగంలో అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్, బయో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, కెమిస్ట్రీ, మేధమేటిక్స్ , బికాం విభాగంలో కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కోర్సులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తమతో పాటు కళాశాల యాజమాన్యం, సిబ్బంది విశేష కృషి చేస్తోందని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ శిక్షణా తరగతులు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలో 3 నుంచి 5 తరగతి బోధించే ఉపాధ్యాయులంతా వారం రోజుల ఆన్‌లైన్ శిక్షణ తరగతుల్లో పాల్గొంటారని తెలిపారు. వెనుకబడిన విద్యార్థుల అభ్యసనా స్థాయిలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని తెలియజేశారు. కోవిడ్-19 కారణంగా రెండు సంవత్సరాలు ముఖ్యంగా పాఠశాల స్థాయిలో మూడు నుండి ఐదు తరగతుల విద్యార్థులు తెలుగు, గణితం కనీస అభ్యసనా స్థాయిలు సాధించడంలో వెనుకబడ్డారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పిల్లల కనీస అభ్యసనా స్థాయిని మెరుగుపర్చేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్స్ ప్రవీణ్ రాజు, విఎస్ఎల్ హెచ్ ఆచార్యులు, ఎల్.రామస్వామి, కె.సాయి సూర్యనారాయణ, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేసిన నూతన పాలకవర్గ సభ్యులు

చినగోపురం పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి వారి దేవస్థానం (చినగోపురం) నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్‌గా జవ్వాజి వెంకట పానకాలు, సభ్యులుగా నున్న వెంకట కోటేశ్వరరావు, కెల్లా భూలక్ష్మి, పొట్టిపాటి అన్నారాణి, సాలా శ్రీనివాస్, చల్లా లక్ష్మీనారాయణ మూర్తి, ఉప్పలపు భారతి లక్ష్మి, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా కర్రి వెంకట శ్రీనివాసాచార్యులతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వర్దినీడి వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒ పిటి గోవిందరావు, ఆలయ ప్రముఖులు మామిడి బాబు, రేపాక ప్రవీణ్ పాల్గొన్నారు.

మానవత పట్టణ అధ్యక్షులుగా త్రిమూర్తులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మానవత పట్టణ కమిటీ ఎన్నిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ భవనంలో ఆదివారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షులుగా సాధనాల త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రాజన్‌నాథన్, కోశాధికారిగా బండి ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా గెస్ కోమరాడా చిన్నా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మానవత సేవలను జిల్లాలోని అన్ని గ్రామాల్లో విస్తరింపజేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధర్, కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధ్యక్షులు సాగిరాజు జానకీరమరాజు పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు నాయకులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రం మొగల్తూరులోని ఏడవ నెంబర్ క్లస్టర్‌లో యూనిట్ బూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిట్ బూత్‌లలో హౌస్ మ్యాపింగ్ నిర్వహించి తప్పులుంటే పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, క్లస్టర్ కత్తిమండ ముత్యాలరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రసాద వితరణ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

కమ్యూనిటీ హాలుకు కుర్చీల బహూకరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

సమతా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సహకారంతో పొలమూరు ఎస్‌సి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు ఆదివారం 22 కుర్చీలు బహూకరించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాడిపర్తి సంపత్ రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాలు, సామాజిక కార్యక్రమాలకు కుర్చీలు కొరతగా ఉన్నందున 22 కుర్చీలను ట్రస్ట్ వారు సమకూర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కాకర రాజేశ్వరరావు, ట్రస్ట్ ప్రోత్సాహకులు కేతా రామకృష్ణ, అడపా పూర్ణచంద్రరావు, వైసిపి నాయకులు వడ్లమూడి ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

27న ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 27వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలన చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు . 15 సంవత్సరాల్లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు.

అధ్వానంగా తయారైన రోడ్డు

వర్షం.. రోడ్డు అధ్వానం!

ప్రజాశక్తి - పెనుమంట్ర

పొలమూరు నుంచి నౌడూరు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. ఈ గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఎక్కడ గొయ్యి ఉందో తెలియక హడలెత్తిపోతున్నారు. రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్న పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. నిన్న మొన్నటి వరకూ వేసవి నేపథ్యంలో వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి పైకి లేవడంతో ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్ర'జల' వేదన..!

తాగునీటి కోసం సగరుపేట వాసుల అవస్థలు
ఉప్పునీటితోనే కనీస అవసరాలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న సగరుపేట మహిళలు

మండలంలోని లంకలకోడేరు పంచాయతీ శివారు సగరుపేట (ఉప్పరగుడెం)లో తాగునీటి కోసం గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. కనీస అవసరాలకు కూడా నీరు రాక ఇబ్బంది పడుతున్నారు. దీంతో వాడుకకోసం భూగర్భ జలాలను ఉపయోగిస్తున్నారు. అవి కాస్త ఉప్పునీరు కావడంతో తాగడానికి పనికిరాక పాలకొల్లు నుంచి నీటిని తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఇంతటి ఘోరమైన పరిస్థితి ఉన్నప్పటికీ ఇక్కడకు వచ్చి ఏ అధికారీ వీరి మొర ఆలకించిన దాఖలాలు లేవు. నీటి కోసం నానా పాట్లు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని మాజీ సర్పంచి ఇబ్బా వెంకటేశ్వర్లు వాపోయారు. తాను పంచాయతీ సర్పంచిగా ఉండగా గ్రామానికి, తమ గ్రామమైన లంకలకోడేరుకు పూర్తిగా తాగునీటి అవసరాలు తీరిన తరువాత ఇతర గ్రామాలకు నీరు ఇచ్చేటట్లు తీర్మానం చేశాం. ప్రస్తుతం గ్రామంలో తాగునీరు లేక ప్రజలు నానా యాతన పడుతున్నారని వెంకటేశ్వర్లు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని మే 25వ తేదీన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు చేసిన కొన్ని రోజుల తరువాత సమస్య పరిష్కారం కాకుండానే ఫిర్యాదును మూసివేశారని వెంకటేశ్వర్లు చెప్పుకొచ్చారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

ఇబ్బా సత్యనారాయణ, ఉద్యోగి, సగరుపేట

నేను మార్కెట్ యార్డులో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాను. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని 1902కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాను. అయినా సమస్యను పరిష్కరించలేదు. రోజూ పాలకొల్లు వెళ్లి తాగడానికి నీరు తెచ్చుకోలేకపోతున్నాం. రోజువారీ అవసరాల కోసం భూగర్భ జలాలను వాడుకుంటున్నాం. అవి ఉప్పునీరు కావడంతో దేనికీ ఉపయోగపడటం లేదు.

ఈ వయసులో ఎక్కడికెళ్లి నీరు తెచ్చుకోవాలి

ఇబ్బా సత్యనారాయణమ్మ, సగరుపేట

నాకు 70 సంవత్సరాలు. ఈ వయసులో ఎక్కడికెళ్లి నేను తాగడానికి నీళ్లు తెచ్చుకునేది. నా అవసరాలు ఎలా తీర్చుకునేది. వంట, బట్టలు ఉతుక్కోవడానికి, ఇంటిని శుభ్రం చేసుకోవడానికి, స్నానానికి నీళ్లు లేక నానా అవస్థలు పడుతున్నాం. కనీసం తాగడానికి కూడా నీరు రావడం లేదు. దుర్భర జీవితం గడుపుతున్నాం.

నానా అవస్థలు పడుతున్నాం..

ఇబ్బా సత్యవతి, సగరుపేట

తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. ఎన్నాళ్లు ఈ బాధలు పడాలి. పాలకొల్లు నుంచి నీరు తెచ్చేవారు కూడా నాకు ఎవరూ లేరు. దిక్కు తోచని స్థితిలో ఉన్నాం. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు కూడా రావడం లేదు. గుక్కెడు నీటి కోసం అలమంటించి పోతున్నాం. ఫిర్యాదు చేసినా పట్టదా. తాగునీరు సరఫరా చేయండి.

మెరుగైన వైద్యసేవలందించాలి : మాజీ మంత్రి పితాని

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలందించాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కోరారు. పట్టణంలో లాకు దిగువన నూతనంగా ప్రారంభించిన జితేంద్ర ఆసుపత్రిని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ఆదివారం వైద్య సదుపాయం అందుబాటులో లేక సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారని, ఆ కొరత తీర్చాలని కోరారు. అలాగే ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్ రాయ్, వలవల శ్రీరామ్మూర్తి పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మేకా రామకృష్ణ, ఆసుపత్రి సర్జన్ దిగుపాటి జితేంద్ర పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పితాని

షాపు ప్రారంభిస్తున్న సర్పంచి శివాజీరాజు

యువత వ్యాపార రంగంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగంపై దృష్టి సారించాలని గొరగనమూడి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) అన్నారు. సర్పంచి శివాజీ రాజు, ఉప సర్పంచి గూడూరి ఆంజనేయులు, విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ ఆదివారం షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యాపార రంగాల్లో ప్రవేశించి తోటి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామానికి చెందిన గొల్ల హేమంత్ ఉన్నత చదువు చదివినా ఉపాధి కోసం రాయల్ మెన్స్ వేర్ షాపును ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆ వైపు అడుగులు వేసిన హేమంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి సహకరించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమానికి ప్రభుత్వం తమ వంతు సహకారం అందించాలని నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ బంగార్రావు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కోరారు. ఆదివారం భీమవరంలో భీమవరం ప్రాంతీయ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం సమావేశం జిల్లా అధ్యక్షులు ఎంవి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బంగార్రావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు జిఒలు ప్రకటించడం పట్ల సమావేశంలో ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రధానంగా చేతి వృత్తులకు చెందిన ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు సంఘటిత శక్తిగా ఎదగాలని కోరారు. ప్రభుత్వపరంగా గతంలో ఎన్నడూ లేని అనేక సంక్షేమ కార్యక్రమాలు పేద వర్గాలకు కేటాయించడం వల్ల వాటిని సద్వినియోగం చేసుకునే స్థాయిలో నాయి బ్రాహ్మణ వృత్తిదారులను కూడా చైతన్యం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సంగీత కళాకారుడు ,విద్వాన్, పిప్పళ్ల ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం భీమవరం ఏరియా నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. కమిటీ అధ్యక్షులుగా ఎం శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులుగా జి.రమేష్, ఎం.భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా పి.వెంకటేశ్వరరావు, ఎ.పెద్దిరాజు, పెదపాటి రామకృష్ణలు, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా అరటి కట్ల వెంకటేశ్వరరావు, పివివి సత్యనారాయణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.వీర వెంకట సత్యనారాయణ, సిహెచ్ లెనిన్ బాబు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

పెంటపాడు: ఈ నెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాకు ప్రజలు, రైతులు, కౌలు రైతులు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు నాయకులు బంకురు నాగేశ్వరరావు తెలిపారు. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద గోడ ప్రతులు రైతు సంఘం ఆధ్వర్యాన ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పంటలకు మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ, ఆక్వా రైతులకు కరెంటు రాయితీ ఇవ్వాలని, సాగునీటి సమస్యను పరిష్కరించాలని, పాడి రైతులకు లీటరుకు 4 రూపాయలు పెంచి ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న జరుగుతున్న మహాధర్నాలో రైతులు, కౌలు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని తెలిపారు. ఒకపక్క రైతు ఆత్మహత్యలు నివారించాలంటే పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి అదనంగా ఇస్తే వ్యవసాయం గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరక వెంకట్రావు, సత్తి కోదండరాం రెడ్డి, యండ్రపు కృష్ణ, మీసాల శ్రీను, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ముక్తేశ్వరరావు

పిఎంపి నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య సేవలందించాలని ది ప్రైమరీ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆఫ్ రాష్ట్ర నూతన అధ్యక్షులు కెఎస్ పిఎన్.ముక్తేశ్వరరావు సూచించారు. మొగల్తూరులోని అందే బాపన్న జూనియర్, కోట్ల వెంకట రంగారావు డిగ్రీ కళాశాలలో ఆవరణలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పిఎంపి వైద్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి సంఘాన్ని పటిష్టపరిచేందుకు సభ్యులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఎపి లోగో ఆవిష్కరించారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ విపి శ్రీనివాస ప్రసాద్, కోశాధికారి జివి.శ్రీనివాస్, పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి చేయనున్నామని మండల స్థాయి జిల్లా స్థాయి వరకూ అసోసియేషన్‌ను విస్తరింపజేస్తూ గ్రామీణ వైద్యులకు పూర్తి అందుబాటులో ఉంటామన్నారు. ఆయా కార్యక్రమానికి ఎబిఎన్ నరసింహారావు, ఎ.ఆనందరావు, సిహెచ్.ఆంజనేయులు, సిహెచ్ రామకృష్ణ, జివి శాస్త్రి, ఐ బాపిరాజు, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆవుల తరలింపు అడ్డగింత

మొగల్తూరు: ఆవులను తరలిస్తున్న లారీని ముత్యాలపల్లి గ్రామస్తులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట నుండి లారీలో కర్ణాటక రాష్ట్రం పులుత్తూరుకు 15 ఆవులు 10 దూడలను తరలిస్తున్నారు. ఇవి కిక్కిరిసిపోయి ఉండడంతో మండలంలోని ముత్యాలపల్లిలో పిఎంపి అసోసియేషన్ మొగల్తూరు శాఖ అధ్యక్షులు కెఎస్‌పిఎన్.ముక్తేశ్వరరావు, పలువురు గ్రామస్తులతో కలిసి లారీని అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న గో సంరక్షణ సమితి సభ్యులు తణుకుల రామకృష్ణ సంఘటన ప్రాంతానికి చేరుకుని ముక్తేశ్వరరావు, రామకృష్ణ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం.వీరబాబు సిబ్బందిని సంఘటనా ప్రాంతానికి పంపించారు. లారీని మొగల్తూరు స్టేషన్‌కు తీసుకొచ్చారు. దీనిపై సమాచారం సేకరించి, వివరాలు తెలుసుకున్నారు. ఆవులుతో కూడా లారీని విడిచిపెట్టారు.

టిడిపితోనే ప్రజలకు మంచి భవిష్యత్

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి పాలనలో ప్రజల జీవితం అస్తవ్యస్తంగా తయారైందని, ప్రజల భవిష్యత్తు మారాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి సంపాదించిన అవినీతి సొమ్ముతో మరోసారి గెలవాలని చూస్తోందని, దీన్ని గమనించి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఎదుర్కొని టిడిపిని అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. గొల్లలకోడేరు గ్రామంలో ఆదివారం టిడిపి కార్యకర్తల సమావేశం గ్రామ టిడిపి అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ ఇసుక, మద్యం పేరుతో వేల కోట్ల రూపాయలు వైసిపి దోచుకుందని విమర్శించారు. డబ్బులను అడ్డం పెట్టుకుని కుయుక్తులు పన్నుతోందని ఉండి నియోజకవర్గంలో అటువంటి వాటికి ఆస్కారం లేదన్నారు. వైసిపి కొత్తగా ఓట్లను తొలగిస్తోందని, ప్రతి ఒక్కరూ ఆయా గ్రామాల్లో ఓటు ఉందో లేదో చూసుకోవాలని సూచించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఉచిత గ్యాస్ బండలు, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, ఎంతమంది విద్యార్థులు చదువుకుంటే అంతమంది పిల్లలకు రూ.15 వేలు అందించనుందని వీటిని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు సాలా మల్లేశ్వరరావు, మాజీ కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, దొంగ కృష్ణ, రెడ్డి శ్రీను, జుత్తిగ శ్రీను, కొండపల్లి ఏసురత్నం, తంగేళ్ల శ్రీను, నడిపూడి అప్పారావు, గాదిరాజు శ్రీనివాసరాజు, గాదిరాజు సీతారామరాజు, ఖాజా వీరాస్వామి పాల్గొన్నారు.

రాంబాబుకు పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ రామరాజు

టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి నాయకులు రాంబాబు

ఉండి నియోజకవర్గ బిసి నాయకులు, వైసిపి ముఖ్య నేత, మాజీ ఎంఎంసి డైరెక్ట్ కామన రాంబాబు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గొల్లలకోడేరులో జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ రామరాజు టిడిపి కండువ కప్పి రాంబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ టిడిపి క్రమశిక్షణ కలిగిన పార్టీ అన్నారు. ఇటువంటి లక్షణాలు మరి ఏ పార్టీలో లేవన్నారు. అభివృద్ధి జరగాలన్నా, బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగాలన్నా ఒక టిడిపితోనే సాధ్యమన్నారు. పార్టీలోకి అడుగుపెట్టడం తనకెంతో ఆనందం కలిగించిందని, పాలకోడేరు మండలంలో బీసీలను అంతా ఏకతాటిపైకి తెచ్చి రాబోయే ఎన్నికల్లో పార్టీ బలోపేతం చేస్తానని తెలిపారు.

ఐటిఐలో అదనపు తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో రూ.5.50 లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదుల భవనాన్ని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభించనునట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందుకూరి సత్యనారాయణ రాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. అనంతరం ఐటిఐలో షార్ట్ టర్మ్ కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు జనసేన బహిరంగసభలో పాల్గొనాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 26 సాయంత్రం నరసాపురంలో జరిగే బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కాపు సేన వ్యవస్థాపకులు చేగొండి హరరామ జోగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురంలో ఏదో ఒకచోట పోటీ చేసే అవకాశం ఉందని, భీమవరం నుంచి పోటీ చేయమని, కార్యకర్తలు ఒత్తిడి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నరసాపురం నియోజకవర్గం వారి కుటుంబానికి సొంత నియోజకవర్గమని పేర్కొన్నారు. 2009లో పిఆర్‌పి తాడేపల్లిగూడెం నుంచి ఘనవిజయం సాధించిందని, ఈ 3 స్థానాల్లో ఎక్కడో ఒకచోట పవన్ కళ్యాణ్ పోటీచేస్తారని తెలిపారు.

సంత్ నిరంకారి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మొగల్తూరు

మారుమూల గ్రామాల్లో సంత్ నిరంకారి సేవలు అభినందనీయమని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ అన్నారు. ఆదివారం కాళీపట్నంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సంత్ నిరంకారి భీమవరం శాఖ సభ్యులు, లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 116 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, 47 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు వైద్యులు తెలిపారని చెప్పారు. 38 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్లు కెవివి ప్రసాద్ రాజు, కె.నరసింహారాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

30న బార్ అసోసియేషన్ అధ్యక్షుని ఎన్నిక

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈనెల 30న బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. ఎన్నికల్లో 14 స్థానాలకు ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎంపికయ్యారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి చల్లా దానయ్య నాయుడు, తానుకొండ సంతోష్, కుమారిల మధ్య పోటీ ఉండబోతోందన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నేటితో నామినేషన్ల గడువు ముగిసిందని తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా అందే మణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌జి.కుమార్, కార్యదర్శిగా కొప్పినీడి చిట్టి పద్మజ, కోశాధికారిగా బళ్ల శ్రీహరి, క్రీడలు, సాంస్కృతిక వ్యవహారాల కార్యదర్శిగా సోడదాసి శ్రీధర్, మహిళా ప్రతినిధిగా కుంచే దుర్గా భవాని, కార్యవర్గ సభ్యులుగా చదలవాడ జ్ఞానప్రకాష్, దొంగ నరసింహరాజు, ఓసూరి జ్యోతి మాంగళ్య, కోపల్లె ఎల్ఎస్ఎస్‌నాగ శిరీష, చల్లా జ్యోతి, ధనాల చాముండేశ్వరి, పులపర్తి హర్షవర్ధన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని వారు తెలిపారు.

నేడు 'డ్రగ్ ఫ్రీ' పై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంటర్నేషనల్ డ్రగ్ డే సందర్భంగా డ్రగ్ ఫ్రీ అవగాహన కార్యక్రమం ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఆదిత్య డిగ్రీ కాలేజ్, శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ నుంచి తాడేపల్లిగూడెం అంబేద్కర్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి డ్రగ్ ఫ్రీ ప్రతిజ్ఞ చేయిస్తామని పేర్కొన్నారు. అనంతరం వాసవీ ఇంజినీరింగ్ కాలేజ్, జిఎంఆర్ కాలేజీల్లో డ్రగ్ వల్ల వచ్చే దుష్ఫలితాలపై విద్యార్థులకు వ్యాసరచన, ఎలక్యూషన్ డిబెట్ పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి, ఏలూరు వారి కోర్టులో
A.S. No. 128/2018

బిట్వీన్:
అయ్యగారి శాంతి కామేశ్వరి **-అప్పిలెంటు**
మరియు
తల్లాప్రగడ విశ్వనాథం మరియు వగైరాలు **-రెస్పాండెంట్లు**

పై నెంబరు గ్రంథమును అప్పిలెంటు, రెస్పాండెంట్లు పై ది. 25-6-2018వ తేదీన ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారు O.S. No. 192/2005 జడ్జిమెంటు డిక్రీని Set avide చేయమని పై కోర్టులో దాఖలు చేసియున్నారు. దానిపై 7వ రెస్పాండెంటు అయిన

R-7: గాలి లక్ష్మి, W/o. సన్యాసిరావు,
D.No. 4-68-3A/16, మామిడి తోట,
ఇందిరా నగర్, 11వ వార్డు, తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా అను వారికి

ఏవిధమైన అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 04-7-2023వ తేదీన ఉదయము 10 గంటల 30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వెలగపూడి వేంకటేశ్వరరావు
ఏలూరు — న్యాయవాది, ఏలూరు
తేది. 27-6-2023 — సెల్: 9849669124